# రాంబాబూ మామిడి పండు

— నళినీ కృష్ణ

"స్మిత వెడ్స్ రాంబాబు" అని పువ్వులతో అలంకరింప బడిన పెద్ద బోర్డు ఆ ఇంటి ముందు అందంగా, గర్వంగా నిలిచి ఆహ్వానిస్తోంది. సమయం మధ్యాహ్నం ఒంటిగంట దాటింది. పెళ్ళి ముహూర్తం ఉదయం తొమ్మిది గంటలకే కాబట్టి అప్పటికి రాంబాబు స్మిత మెళ్లో మూడు ముళ్ళూ వేసి తన దాన్ని చేసేసుకున్నాడు.

రాంబాబుకి తెలిసిన వారు, తెలియనివారు అందరూ వచ్చి కరచాలనం చెయ్యడం, కానుకలివ్వడం అన్నీ అప్పుడే అయ్యాయి. ముహూర్తం వేళకి పెట్టిన జీలకఱ్ఱ-బెల్లం నడినెత్తిన అప్పచ్చిలా అతుక్కుపోయి రాంబాబుకి ఆ ఎండా కాలంలో చికాకుని కలుగ జేస్తోంది. అప్పుడే వెళ్ళి షవర్‌బాత్ తీసుకోవాలన్న తీవ్రమైన కోరికను చాలా కష్టపడి ఆపుకున్నాడు. నున్నగా, నల్లగా నిగనిగా మెరిసిపోతూ 'సఫే'గా ఉన్న రాంబాబు వత్తైన క్రాపు మీద స్మిత జీలకఱ్ఱ-బెల్లం పెట్టినప్పుడు ఆ ముద్ద జారుడు బల్ల మీంచి జారినట్టు జర్రున జారసాగింది. కూతురి అవస్థ చూసిన పార్వతమ్మగారు అల్లుడి నెత్తిన రపీమని ఓసారి ముద్దుగా ఆ ముద్దని 'సద్దింది'. అంతే! ఆ దెబ్బకి అది అప్పచ్చిలా అతుక్కుంది మరి!



ఆ దెబ్బకే రాంబాబు గుండె స్థానభ్రంశం చెంది, తెప్పరిల్లి మళ్ళీ యథాస్థానం ప్రవేశించింది. అతని కళ్ళద్దాలు మాత్రం ఆగలేక వళ్ళో పడ్డాయి. సెన్సెస్‌లోకి వచ్చి తిరిగి తన కళ్ళద్దాలు పెట్టుకున్నాడు రాంబాబు. ఇదేగాక, అక్షింతలు జడివాన తుంపరల్లా మీద పడి గుచ్చుకున్నా, స్మిత కోసం. అన్నిటికీ సిద్ధపడి వచ్చిన వీరుడిలా తట్టుకున్నాడు పాపం.

అమెరికాలో ఎమ్.ఎస్. చేసి అక్కడే నెలకి ఐదు వేల డాలర్ల జీతంతో ఆర్నెల క్రితం ఉద్యోగం సంపాదించిన రాంబాబు, వధువు వేటలో నెల రోజులు సెలవు పెట్టి వచ్చి, చూసిన తొలి చూపులోనే స్మిత కోసం హెడ్ నించి హీల్స్ వరకు 'లవ్ బగ్' చేత కరిపించబడ్డాడు. అటు పెద్దవాళ్ళు, ఇటువైపువారు అతని బాధని అర్థం చేసుకుని ఓ శుభ ముహూర్తాన తాంబూలాలు పుచ్చుకుని అర్జంటుగా ఈ పెళ్ళిని జరిపించేసారు.

ప్రస్తుతం అందరూ భోజనాలకి కూర్చున్నారు. ఓ రెండు ముద్దలు తిన్నాక స్మిత పిన్ని అందరూ వచ్చి వారిద్దరినీ చుట్టుముట్టేసి రాంబాబు కోరికిన లడ్డు స్మిత చేత తినిపించారు.

'నాకు కూడా నో అబ్జెక్షన్' అంటూ రాంబాబు స్మిత కొరికిన జిలేబీ ముక్క ఎంతో ఆనందంగా తినేసాడు. స్మిత ముఖం ఎర్రగా పండిన టమాటాలా అయ్యింది. 'ఆహా, ఇది ఏ తోటలోని టమాటా, ఎగరేసింది నా మదిలో ప్రేమ బాటా' అనుకుంటూ తన్మయంగా స్మిత కేసి చూడసాగాడు రాంబాబు.

ఇలా వారిద్దరూ ముద్దల సుద్దులాడుకుంటూ తాపీగా భోం చేస్తుండగా 'పంచదార కలశాల'నే రసాల మామిడి పళ్ళు వడ్డించసాగారు ఆడపెళ్ళి వారు. ఇలాంటి మామిడి పళ్ళకై ముఖం వాచిపోయిన రాంబాబు ఆవేశంగా ఆ పండుపై లంఘించి ఓ పట్టు పట్టాడు. అంతే, అది జెట్ స్పీడుతో విమానంలా దూసుకుపోయి ఎదురు పంక్తిలో కూర్చున్న స్మిత మేనమామ విశ్వనాథం గారి విస్తరిలో 'లేండ్' అయ్యింది. అదృష్టవశాత్తు ఆయన తన పక్కనున్న రాంబాబు యొక్క బాబాయి ప్రకాశంగారికి ఎంతో ఆవేశంగా వీరసుత్తి వేయడంలో బిజీగా ఉండి ఈ ఆకస్మాత్ మామిడి పండు 'మైనస్ తొక్క' లేండింగ్‌ని 'మిస్' అయిపోయాడు. కాని ఆ సుత్తిని భరించలేక దిక్కులు చూస్తున్న ప్రకాశంగారు ఈ ఘటనని చూసి దిగ్భ్రాంతి చెంది నెక్స్‌ట్ సీను ఊహించుకుని గాభరా పడ్డారు. ఈ అనెక్స్‌పెక్టెడ్ డిపార్చర్ కి రాంబాబు గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డట్టయ్యింది. కాని దూరదృష్టితో రాంబాబు తన వెండి కంచంలో ఉన్న 'తొక్క'ని కంచం కిందకి నెట్టేసి రిలాక్స్ అయి భోజనం చేస్తున్నట్టు నటించసాగాడు. అతని 'మేకపోతు గాంభీర్యం' చూసిన స్మిత అతి కష్టం మీద నవ్వాపుకుంది. రాంబాబుకి లోలోన టెన్షన్ పెరిగి ముచ్చెమటలు పట్టసాగాయి. అబ్బాయి టెన్షన్ చూసిన బాబాయి అపర విష్ణుమూర్తిలా అభయమిచ్చాడు, తన కళ్ళతోనే. విశ్వనాథానికి తెలీకుండా అతని విస్తరిలోని 'ఫారెన్ బాడీ'ని తీసి తన విస్తట్లో వేసుకోవాలి. ఎలా? చాలా పెద్ద సమస్యే!

పైకి విశ్వనాథం మాటలు ఎంతో ఆసక్తిగా వింటున్నట్టు 'ఆ, ఆహా, అలాగా' అంటూనే మెల్లిగా తన చేతిని విశ్వనాథం విస్తరివైపు పోనిచ్చాడు ప్రకాశం. కష్టపడి ఆ మామిడి పండుని లొకేట్ చేసాడు. కాని అదే సమయానికి జిలేబి తిందామనుకుని తన విస్తరిలో వెతుక్కుంటున్న విశ్వనాథం అన్‌ఫార్చునేట్లీ ప్రకాశం చేతిని పట్టుకున్నాడు. వెంటనే ప్రకాశం తన చేతిని వెనక్కి తీసేసాడు.

'ఓహ్ సారీ అండి, పొరపాట్న మీ విస్తట్లో చేయి పెట్టాను' అంటూ కిందికి చూసిన విశ్వనాథానికి ఆశ్చర్యం కలిగింది అది తన విస్తరే!

'అరే, ఇది నా విస్తరే!' అని నవ్వబోయి ఆగిపోయాడు. తన విస్తట్లోని 'మామిడి పండు మైనస్ తొక్క'ని చూసి 'మామిడి పళ్ళు ఇప్పుడేగా వడ్డిస్తున్నారు, ఇదేలా వచ్చిందండి నా విస్తట్లోకి?' అని ఎంతో ఆశ్చర్యంగా ప్రకాశం కేసి చూసి, నలు దిక్కులా చూడసాగాడు. బాబాయి ముఖం తెల్లగా పాలిపోయింది. రాంబాబుకి బి.పి పెరిగిపోసాగింది.

ఈపాటికి చాలా మందికి ఈ గోల తెలిసిపోయింది. కాని ఆ మామిడి పండు 'ఫ్లైట్'ని చూసిన వారు కొద్దిమందే! విశ్వనాథానికి ఉన్న ఆచారం, చాదస్తం, అతని ఆచారాలకి భంగం కలిగితే అతను దాల్చే విశ్వరూపం చూసిన వారందరూ భయభ్రాంతులైనారు. అక్కడంతా డి.ఇ.ఓ. వస్తే క్లాసెంత నిశ్శబ్దంగా ఉంటుందో అలాటి వాతావరణం ఏర్పడింది.

వడ్డించేవారిలో స్మిత చెల్లెలు హైమ ఆ 'ఘటన'ని చూసింది. కాని ఈ విషమ పరిస్థితినుండి బావగారిని ఎలా కాపాడాలా అని ఆలోచిస్తూ బావగారిని చూసిందోసారి. 'ఏతీరుగ నను దయచూసెదవో మరదలు పిల్లా హైమా, నా తరమా భవసాగరమీదను

నీవే దిక్కు హైమా' అని తన దీన వదనంతో సజల నయనాలతో ఖైదులో ఉన్న రామదాసు లెవెల్‌లో హైమని వేడుకున్నాడు రాంబాబు.

'పాపం బావగారు' అనుకుంది హైమ.

వెంటనే విశ్వనాథం దగ్గరికి వచ్చి 'మామయ్యా నీకు మామిడి పళ్ళంటే ఇష్టమని ముందే నేను నీ విస్తట్లో ఓ మామిడి పండు వసాను. నువ్వు మాటల్లో పడితొక్క తినేసావు' అని నవ్వింది.


వెంటనే అక్కడ అందరూ అవునంటూ నవ్వేసారు, తెచ్చిపెట్టుకుని.కాని విశ్వనాథం గట్టివాడు!

"ఆగండి. నేనేమి అంత తెలీని వాడ్ని కాదు. నేనెప్పుడూ అసలు తొక్క వేరేగా తీసి తినను పండు వదిలేసి. ఇందులో ఏదో 'ఫారెన్ హేండ్' వుంది అన్నాడు రాజకీయ నాయకుడిలా. 'ఫారెన్ హేండ్' మాట విని రాంబాబు మరింత గాభరా పడ్డాడు. కాని హైమ రాంబాబు పంక్తిలోనే ఒక ఎనిమిది తర్వాత కూర్చుని చోద్యం చూస్తున్న విశ్వనాధం కొడుకు, తన బావ, బాలకృష్ణఉరఫ బాచి వద్దకు వెళ్ళి అతన్ని ప్రేమగా చూస్తూ 'బాచి బావా, మామయ్య తిన్నాడు కదా ఆ పండు, నువ్వే చెప్పు' అంది గోముగా.

మరింక బాచి ఐసై పోయాడు. ఓ రెండు సెకన్లు హైమ కళ్ళల్లోకి ప్రేమగా చూసాడు. 'తేరే ఆంఖోంకే సివా దునియామే రఖీ క్యాహై' అని పాడాలనిపించింది బాచీకి. కాని కంట్రోల్ చేసుకున్నాడు. ఆసందర్భంగా ఉంటుందనిపించి. వెంటనే 'అవున్నాన్నా. నువ్వే తిన్నావు. నేను చూసాను కూడా. కానీ చెప్తే ఇక్కడ అందరూ నవ్వుతారని చెప్ప లేదు." అన్నాడు ప్రేమ మైకంలో పడి. ఇంక విశ్వనాథానికి వప్పుకోక తప్పింది కాదు.

అతనికి తానా పని చేసాడంటే నమ్మ బుద్ధి కావట్లేదు. కానీ స్ట్రాంగ్ ఎవిడెన్స్ ఉంది.

'అవునా, నేనే ఆ 'తొక్క'ని తినేసానా? ఏమో. తిన్నానేమో?' అని సరి పెట్టుకోసాగాడు. అయోమయంలో పడి.



మరింక అతన్ని ఆలోచించనివ్వకూడదని అందరూ అనుకున్నారేమో 'అవును విశ్వనాథం. నువ్వే తినేసావు. మరేం పర్లేదులే అని అంటూ అతన్ని హిప్నటైజ్ చేయసాగారు.

ప్రకాశంగారు ఈ సారి సుత్తి వేసే ఛాన్సు తనకి వచ్చినందుకు సంబరపడ్తూ మామిడి తొక్కలో ఏమేమి విటమిన్లు ఉన్నాయో, అది తింటే ఎంత మంచిదో రక రకాలుగా చెప్పసాగారు విశ్వనాథానికి. అందరూ తమ స్థానాల్లో పదిలంగా కూర్చుని భోజనం ముగించారు.

"థేంక్ గాడ్, కాదు. థేంక్ హైమ', అనుకుని ఓ గ్లాసెడు మంచి నీళ్ళు తాగి ఆ ఉపద్రవం నుండి తనను గట్టెక్కించిన మరదలు సమయస్ఫూర్తికి మనసారా అభినందించాడు రాంబాబు.

• • •

ఆ రోజు శోభనం రాత్రి. గదిలోకి చేతిలో వెండి గ్లాసులో పాలతో సిగ్గుగా అడుగుపెట్టింది స్మిత. మూర్తీభవించిన సౌందర్యమూర్తిలా ఒదిగి నిలచిన స్మితను చూసి ముందు రోజు మధ్యాహ్నం జరిగిన ఉపద్రవాన్ని పూర్తిగా మరిచిపోయాడు రాంబాబు. ఇప్పుడు రసిక చక్రవర్తి అయిపోయాడు. ఇండియాకి వచ్చాక చూసిన తెలుగు సినిమాలోని శోభనం సీను గుర్తుకు తెచ్చుకున్నాడు. కానీ తనకి పాటలూ, గంతులూ రావే అని ఓ నిమిషం బాధ పడ్డాడు. కాని నెవర్ మైండ్ అని ప్రొసీడ్ అయి స్మిత దగ్గరికి వెళ్ళి ఆమె భుజాల చుట్టూ చేయి వేసి నడిపించుకొచ్చాడు. ఆమె చేతిలోని పాలగ్లాసు తీసుకుని తాను కొంచెం త్రాగి 'ఇక నుంచి యూ ఆర్ మై బెటర్ హాఫ్ మనం అన్నీ షేర్ చేసుకోవాలి, ఓ.కె.' అంటూ మిగిలిన సగం ఆమె చేత త్రాగించాడు. ఆమె చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు. ఆమె రెండో చేతిని కూడా తన చేతిలోకి తీసుకుంటూ "వెల్‌కమ్ ఇన్ టు మై లైఫ్, త్రీ ఛీర్స్ టు అవర్ లవ్ లైఫ్" అంటూ ఎంతో ప్రేమగా ఆమె అర చేతుల్ని ముద్దాడబోయి షాక్ తిన్నట్టు అబ్రప్ట్‌గా ఆగిపోయాడు రాంబాబు. ఆమె ఎడమ చేతిలోని మామిడి పండు అతన్ని వెక్కిరిస్తున్నట్టు అనిపించింది రాంబాబుకి.

వెంటనే ఆమెని వదిలి కిటికీ దగ్గర నిల్చుని ఆకాశంలోకి చూస్తూ చుక్కల్ని లెక్క పెడ్తూ తన కోపాన్ని కంట్రోల్ చేసుకోడానికి ప్రయత్నించసాగాడు. ఈ రియాక్షన్‌ని ఊహించిన స్మిత అతని దగ్గరికి వచ్చి సుతారంగా అతని భుజం మీద చేయి వేసి అతన్ని తన వైపు తిప్పుకుంది. ప్రేమగా అతని కళ్ళలోకిచూస్తూ "కోపమా?" అంది. ఆమె కళ్ళల్లోని ప్రేమకి కరిగిపోయాడు రాంబాబు.

"నాకు ఆ మామిడి పండంటే కోపం. కాని నువ్వంటే చాలా ప్రేమ. ఐ లవ్ యూ మై డియర్" అన్నాడు పరవశంగా.

"అమ్మయ్య. నా మీద కోపం లేదు కదా! అయినా ఆ మామిడి పండు మాత్రం ఏం చేసిందని మీకంత కోపం? నాకు మామిడిపళ్ళంటే చాలా ఇష్టం. ఎంత రుచిగా ఉంటాయో! కాని మీకు ఇష్టం లేనిది నేను మాత్రం ఎలా తింటానండి? పోన్లెండి, నేనూ మానేస్తాను" అంది స్మిత బాధగా.



ఆమెని బాధ పెట్టినందుకు ఎంతో నొచ్చుకున్నాడు రాంబాబు.

"అబ్బే, నువ్వు మానేయకు. నువ్వు తిను. ఐ హావ్ నో అబ్జెక్షన్. కానీ నేను తినను. ఐ జస్ట్ హేట్ ఇట్." అన్నాడు.

"మనిద్దరికీ పెళ్ళైంది కదా. విలవ్ ఈచ్ అదర్. యువర్ లైక్స్ ఆర్ మైలైక్స్. మీ ఫ్రెండ్స్ ఇక నుంచీ నాకూ ఫ్రెండ్స్. అలాగే నా ఫ్రెండ్స్ కూడా మీ ఫ్రెండ్స్ అవునా?"

"ఆఫ్ కోర్స్!"

"అలాగే మీకు ఏది ఇష్టమైతే నాకూ అదే ఇష్టం. మీకూ అంతే కదా?"

"అవుననుకో. ఎక్సెప్ట్ మేంగో" అన్నాడు రాంబాబు చేదుగా.

"నో ఎక్సెప్షన్స్, ఇది సరిగ్గా తినడంరావాలి గాని. దాన్ని అలా 'బేన్' చేయకూడదు. ప్లీజ్, నామాట వినరూ" అంది స్మిత ముద్దుగా.

తన భార్య మొట్ట మొదటిసారిగా అడిగిన వరం కాదనకూడదని అయిష్టంగానే 'ఓకే' అన్నాడు రాంబాబు.

స్మిత ముఖం సంతోషంతో వెలిగిపోయింది, ఆ రెండు ముక్కలు విని. ఆమె ముఖంలో సంతోషం చూసి ఎంతో ఆనందించాడు రాంబాబు. పోన్లే ఈ సుందర వదన ముఖంలో ఎప్పుడూ ఇలాగే ఆనందం వెల్లి విరియడానికి తానేమైనా చేయగలడు. ఈ మామిడి పండో లెక్కా? అనుకున్నాడు, ఆమెని దగ్గరకి తీసుకుంటూ.

స్మిత అతనికి మమిడి పండు పద్ధతిగా ఎలా తినాలో నేర్పింది. మరెప్పుడూ రాంబాబు పదిమందిలోనూ మామిడి పండు తినడానికి భయపడలేదు.